# భారత్-ఫ్రాన్స్ సంబంధాలు.. సరికొత్త అధ్యాయం!!

**ఫ్రెంచ్ విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం.. భారత స్వాతంత్రోద్యమానికి ప్రేరణ.. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక... రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ప్రారంభమయ్యాయి. అప్పటినుంచి రక్షణ, వాణిజ్య రంగాల్లో... సహకరించుకోవడం మొదలుపెట్టాయి. మధ్యలో కొంతకాలం స్తబ్ధత కొనసాగినా... 1998లో ఫ్రాన్స్ అప్పటి అధ్యక్షుడు జాక్వెష్ షిరాక్ భారత పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాల్లో ఊపొచ్చింది. ఇప్పుడు మంచి పురోగతి కనిపిస్తోంది. రక్షణ, వాణిజ్య, అణు రంగాల్లో ఒప్పందాలు ఖరారు చేసుకుంటూ... అంతర్జాతీయ వ్యవహారాల్లో పరస్పరం మరింత సహకారం దిశగా భారత్, ఫ్రాన్స్ అడుగులేస్తున్నాయ్!!**

కొన్నేళ్లు స్తబ్దుగా ఉండిపోయిన భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో... ప్రస్తుతం చెప్పుకోదగ్గ మార్పు కనిపిస్తోంది. గతంలో వాణిజ్యం మందకొడిగా ఉండేది. దానికి కారణం భారతీయ మార్కెట్‌లో ఫ్రాన్స్ పరిమితమైన ప్రయోజనాలనే ఆశించడం.. మరోవైపు పాకిస్థాన్‌కు ఆయుధ అమ్మకాలపట్ల ఆ దేశం అమితాసక్తిని ప్రదర్శించింది. దాంతో గతంలో రెండు దేశాల మధ్య చెప్పుకోదగ్గ స్థాయిలో సంబంధాలు పటిష్టంకా లేదు.

## సంబంధాల్లో పురోగతి... కారణాలు:

తాజాగా ఉమ్మడి వ్యూహాత్మక ప్రయోజనాలే రెండు దేశాల మధ్య సంబంధాల్లో పురోగతికి కారణంగా చెప్పొచ్చు. భారత్, ఫ్రాన్స్‌లు సంప్రదాయకంగా రాజకీయ స్వయం ప్రతిపత్తిని(పొలిటికల్ అటానమీ) కలిగున్నాయి. అంతేకాకుండా.. అంతర్జాతీయ సంబంధాల్లో బహుళ వ్యవస్థను సమర్థించడం ఇరు దేశాలకు అవసరమే. జనాభాపరంగా, ఆర్థికంగా, భౌగోళిక-రాజకీయ వాస్తవ పరిస్థితుల నేపథ్యంలో.. రెండు దేశాలు కూడా సమన్యాయ అంతర్జాతీయ వ్యవస్థకు సానుకూలంగా ఉన్నాయి. సరికొత్త అంతర్జాతీయ వ్యవస్థలో ఐరోపా ఒక ధ్రువంగా, భారత్ మరో ధ్రువంగా తమ తమ పాత్ర పోషించాలని ఫ్రాన్స్ కోరుకోవడం కూడా రెండు దేశాల మధ్య సంబంధాల్లో పురోగతికి కారణంగా భావించవచ్చు. రెండు దేశాల మధ్య 1950 నుంచే రక్షణ రంగంలో సహకారం కొనసాగుతోంది. 1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పటికీ... ఇది కొనసాగడం విశేషం. భారత్ అణు పరీక్షలు జరపడానికి దారితీసిన పరిస్థితులను ఫ్రాన్స్ అర్థం చేసుకుంది. 2008, సెప్టెంబరులో రెండు దేశాలు పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు కూడా చేశాయి. న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్(ఎన్ఎస్‌జీ)తో భారత చర్చల విషయంలో ఫ్రాన్స్ సహకారం కీలకంగా మారిన సంగతి తెలిసిందే. భారత రక్షణ వ్యూహాల్లో ఫ్రాన్స్‌కు చెందిన మిరేజ్-2000ది కీలక పాత్ర. ప్రస్తుతం ఇరుదేశాలు పలు విధాలుగా సైనిక సహకారాన్ని పెంచుకునే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం

భారత ప్రయత్నాలకు ఫ్రాన్స్ గట్టిగానే మద్దతు తెలిపింది. మండలిలోని శాశ్వత సభ్యదేశాలైన రష్యా, బ్రిటన్ ఇప్పటికే భారత్‌కు మద్దతుపలుకగా.. ఇప్పుడు ఆ జాబితాలో ఫ్రాన్స్ కూడా చేరింది. ఇవన్నీ రెండు దేశాల మధ్య సంబంధాల్లో పురోగతికి దారితీశాయి.

### కీలక రంగాలు:

ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి బెర్నార్డ్ కౌచర్ 2007, డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండు కీలక రంగాల్లో భారత్‌తో తమ దేశం ద్వైపాక్షిక సంబంధాలను గట్టిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో అకడమిక్ ఎక్స్ఛేంజెస్, హై టెక్నాలజీ రంగంలో సైంటిఫిక్ అండ్ టెక్నికల్ కోఆపరేషన్, ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా భారత్‌తో పారిశ్రామిక సహకారానికి ఫ్రాన్స్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న భూతాపం, ప్రబలుతున్న వ్యాధులు, అంతర్జాతీయ ఆర్థిక, విత్త నిర్వహణ తదితర అంశాలపై ఉమ్మడిగా కృషి చేయాలన్నారు. ఆ దిశగా జీ-8ను జీ-13గా విస్తరిస్తూ.. భారత్, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, మెక్సికోలకు చోటు కల్పించాలనే ఫ్రాన్స్ సూచన కీలకంగా మారింది.

### భిన్నాభిప్రాయాలు:

భారత్, ఫ్రాన్స్‌ల మధ్య కొన్ని అంతర్జాతీయ అంశాలకు సంబంధించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఇరాన్ అణ్వా యుధాలను సంపాదించుకోవడాన్ని ఫ్రాన్స్ గట్టిగా వ్యతిరేకిస్తోంది. అంతేకాకుండా ఇరాన్‌ను ముప్పుగా కూడా భావిస్తోంది. అంతర్జాతీయ నిబంధనలను పాటించేందుకు నిరాకరిస్తున్న ఇరాన్‌పై... ఐక్యరాజ్యసమితి నిబంధనలకు లోబడి మరిన్ని చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని ఫ్రాన్స్ స్పష్టం చేస్తోంది. ఇరాన్‌తో తిరిగి సంబంధాలు కొనసాగించాలని భారత్ నిర్ణయించింది. ఇరాన్ పశ్చిమాసియా ప్రాంతంలో భద్రతపరంగా స్థిరత్వ కారకమంటూ... భారత విదేశాంగ కార్యదర్శి శివశంకర్ మీనన్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవించడానికి ఫ్రాన్స్ నిరాకరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఫ్రాన్స్ మరింత కఠినతరం కాకుండా చూడాలని మన దేశం కోరుకుంటోంది. మయన్మార్ విషయంలోనూ రెండు దేశాల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. మయన్మార్‌లోని సైనిక ప్రభుత్వంపట్ల భారత్ మెతకగా వ్యవహరిస్తోందని ఫ్రాన్స్ అభిప్రాయపడుతోంది. అలాకాకుండా ఆ దేశం పట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే ఆంక్షలు విధించాలనే డిమాండ్‌ను సమర్థించాలని కూడా భారత్‌ను కోరుతోంది. పాకిస్థాన్‌లో రాజకీయ అస్థిరత నెలకొన్నప్పటికీ... ఆ దేశానికి ఆయుధాల అమ్మకంపై ఫ్రాన్స్ ఎలాంటి నియంత్రణలు విధించుకోలేదు. ఇది సహజంగానే భారత్‌కు రుచించదు.

### నేపథ్యం:

1965లో పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో.. భారత్‌కు ఆయుధాల సరఫరాపై ఐక్యరాజ్యసమితి ఆంక్షలు

విధించింది. ఆ సమయంలో జనరల్ డీ గొల్లే నేతృత్వంలోని ఫ్రాన్స్... భారత్‌కు సహకరించేందుకు ముందుకు వచ్చింది. బంగ్లాదేశ్ యుద్ధ సమయంలోనూ ఫ్రాన్స్ సానుభూతిగానే వ్యవ హరించింది. అణు ఇంధన రంగంలో.. అంతరిక్ష టెక్నాలజీ రంగంలో... భారత్, ఫ్రాన్స్‌ల మధ్య దీర్ఘకాలంగా సహకారం ఉంది. తారాపూర్ అణు రియాక్టర్‌కు అమెరికాకు బదులుగా ఫ్రాన్స్ యురేనియంను సరఫరా చేస్తోంది. 1998, జనవరిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు జాక్వెస్ షిరాక్ భారత పర్యటన సందర్భంగా... వ్యూహాత్మక చర్చల దిశగా రెండు దేశాల మధ్య నిర్ణయం జరిగింది. దక్షిణాసియాలో, హిందూ మహాసముద్రం ప్రాంతంలో.. వ్యూహాత్మక సమతౌల్యం.. చైనా, పాకిస్థాన్‌లతో భారత సంబంధాలు.. భారత అణు సిద్ధాంతం.. ఐరోపా సమాఖ్య ఏకీకరణ.. నాటో వంటి అంశాలు ఈ వ్యూహాత్మక చర్చల అంశాలు.

### వ్యూహాత్మక చర్చలు... ప్రాధాన్యం:

భారత్-ఫ్రాన్స్‌ల మధ్య వ్యూహాత్మక చర్చలకు అంతర్జా తీయ ప్రాధాన్యం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్చలు రష్యాను కూడా ప్రభావితం చేస్తాయని.. ఏక ధ్రువ వ్యవస్థకు ముగింపు పలికి.. బహుళ ధ్రువ వ్యవస్థ ఏర్పాటు దిశగా ఇది దోహదం చేస్తుందని వారంటున్నారు. ఆ క్రమంలో తాజా అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్‌కు సముచిత స్థానం లభిస్తుందనేది నిపుణుల అంచనా. ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక చర్చలు... భారత్-అమెరికా అణు చర్చలను ప్రభావితం చేసే అవకాశముందని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పోఖ్రాన్ అనంతర భారత దౌత్యనీతికి ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక చర్చలు ఊతమియడం ఖాయం. ఫ్రాన్స్ నుంచి భారత్‌కు అత్యాధునిక టెక్నాలజీ బదిలీ అయ్యేలా రెండు దేశాలు ఒక అవగాహనకు వచ్చేందుకు కృషి చేస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### ఫ్రాన్స్ అధ్యక్షుడి పర్యటన:

2008, జనవరి 25, 26 తేదీల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ భారత్‌లో పర్యటించారు. భారత రిపబ్లిక్ డేకు ముఖ్య అతిధిగా ఆయన హాజరయ్యారు. ఈ పర్యటన సందర్భంగా.. మూడు అంశాలపై ముఖ్యంగా దృష్టిసారించడం జరిగింది. అవి.. వ్యూహాత్మక భాగస్వామ్యం.. ఆర్థిక సంబంధాలు.. స్టూడెంట్స్ ఎక్స్చేంజ్ కార్యక్రమం. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం... కేవలం అమ్మకం-కొనుగోలు సంబంధానికే పరిమితం కాకూడదని సర్కోజీ భారత పర్యటన సందర్భంగా నిర్ణయించారు. ఎన్ఎస్‌జీ నుంచి భారత్‌కు ప్రత్యేక మినహాయింపు లభించగానే... పౌర అణు ఇంధన సహకారంపై ద్వైపాక్షిక ఒప్పందానికి తుది రూపునిస్తారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత ప్రయత్నాలకు ఫ్రాన్స్ మద్దతు తెలిపింది. ఉగ్రవాదంపై పోరులో భాగంగా రెండు దేశాల నిఘా విభాగాల మధ్య సహకారం అవసరమని నిర్ణయించారు. అణు రంగంలో పరిశోధనలతో సహా ఐదు ఒప్పందాలపై సర్కోజీ పర్యటన సమయంలో సంతకాలు జరిగాయి. అణు శాస్త్రవేత్తల రాకపోకలను ప్రోత్సహించాలని

కూడా ఈ సందర్భంగా రెండు దేశాలు ఒక అంగీకారానికి వచ్చాయి. జీ-8లో భారత ప్రవేశాన్ని సర్కోజీ సమర్థించారు.

## ఫ్రాన్స్‌లో మన్మోహన్:

భారత ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ 2008, సెప్టెంబరులో ఫ్రాన్స్‌లో పర్యటించారు. ఆ సందర్భంగానే సెప్టెంబరు 30న పౌర అణు సహకార ఒప్పందంపై రెండు దేశాల మధ్య సంతకాలు జరిగాయి. భారత అణు వాణిజ్యానికి అనుకూలంగా ఆంక్షల ఎత్తివేతకు ఎన్ఎస్‌జీ అంగీకరించగానే.. భారత్‌తో పౌర అణు ఒప్పందం చేసుకున్న తొలి దేశం... ఫ్రాన్స్. అణు రియాక్టర్లు, అణు ఇంధన సరఫరా, అణు సేఫ్టీ, రేడియేషన్, పర్యావరణ పరిరక్షణ, అణు ఇంధన సైకిల్ నిర్వహణ తదితర విభాగాల్లో ఫ్రాన్స్‌తో భారత వాణిజ్యానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుంది. భారత్- ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పౌర అణు ఒప్పందం ఒక కొత్త దిశను ఇచ్చింది. చెన్నై సమీపంలోని కల్పకం వద్ద ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్.. వడోదరాలో భారజల ఉత్పత్తి కేంద్రం.. తారాపూర్ అణు రియాక్టర్‌కు వృద్ధి చేసిన యురేనియం సరఫరా వంటి విషయాల్లో రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక సంబంధాలున్నాయి. అణు ఒప్పందం అమల్లోకి వచ్చేలా భారత్, ఫ్రాన్స్‌ల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందాలు జరుగుతాయని భారత అణు ఇంధన కమిషన్ ఛైర్మన్ అనిల్ కకోద్కర్ తెలిపారు.

2009, జూలై 14న జరిగిన ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాలకు ముఖ్య అతిథిగా భారత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ఆ దేశం ఆహ్వానించింది. మన్మోహన్‌ను తమ జాతీయ దినోత్సవాలకు ఆహ్వానించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో భారత్ ఓ శక్తిమంత దేశమని ఆయన అన్నారు. ఫ్రెంచ్ విప్లవం జరిగి 220 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన బాసటిల్లే డే పరేడ్‌కు మన్మోహన్ గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ... భారత్, ఫ్రాన్స్‌ల మధ్య 1998లో మొదలైన వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను మరింత పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 14న కన్నుల పండుగగా జరిగిన పరేడ్‌లో భారత సైనిక దళాలను ఫ్రాన్స్ ఆహ్వానించడం ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. 1789 నాటి ఫ్రెంచ్ విప్లవం... భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణగా పనిచేసిందన్నారు. అంతేకాకుండా భారత రాజ్యాంగకర్తలకు మార్గనిర్దేశనం చేసిందన్నారు. ఫ్రెంచ్ విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రపంచ చరిత్రగతినే మార్చివేసాయన్నారు.

## ద్వైపాక్షిక పటిష్టత:

భారత రిపబ్లిక్‌డేకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీని ఆహ్వానించడం.. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాలకు ముఖ్య అతిథిగా భారత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను పిలవడం.. రెండు దేశాల మధ్య పటిష్టమవుతున్న ద్వైపాక్షిక సంబంధాలకు సంకేతమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2008లో ఎన్ఎస్‌జీతో, అంతర్జాతీయ అణు ఇంధన అసోసియేన్‌తో భారత చర్చలను ఫ్రాన్స్ గట్టిగా సమర్థించడమే అందుకు నిదర్శనం. భారత్ పౌర అణు ఒప్పందంపై అమెరికా, రష్యా తర్వాత సంతకాలు చేసిన మూడో దేశం ఫ్రాన్స్ కావడం విశేషం. ఇది భారత్ అణు ఇంధన సంబంధాలు కేవలం అమెరికాకు మాత్రమే పరిమితం కాదనే విషయాన్ని స్పష్టం చేసింది. మరోవైపు రెండు దేశాల మధ్య వాణిజ్య, సాంస్కృతిక, ప్రజా సంబంధాలను పెంపొందించే దిశగా కూడా కృషి జరుగుతోంది!!

**చర్చించిన అంశాలు:**

మన్మోహన్, సర్కోజీ భేటీ సందర్భంగా పలు కీలకాంశాలు చర్చకు వచ్చాయి. అవి..

- ఉగ్రవాదంపై పోరు.
- పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్, ఇరాక్, పశ్చిమాసియా పరిణామాలు.
- రక్షణ, అణు రంగాల్లో మరింత సహకారం.
- ఫ్రాన్స్ కంపెనీతో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఒప్పందం.
- రాఫాలే ఫైటర్ ప్లేన్స్‌ను భారత్‌కు అమ్మాలనే ఫ్రాన్స్ కోరిక.

SAKSHI